

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**అన్నయ్య** చెప్పింది విని గబగబా తయారయ్యి ఒక నీళ్ళ బాటిల్ తీసుకున్నాను. చలిగా ఉంటుందని కొత్తగా కొన్న జాకెట్ టాగ్ కట్ చేసి మురిసిపోతూ వేసుకున్నాను. సులువుగా ఉండేందుకు మూడుసార్లు కుడివైపు సందులోకి, మూడుసార్లు ఎడమ వైపు సందులోకి తిరగడం మేలనిపించింది. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో దాదాపు అందరూ ఆఫీసుకి బయలుదేరే సమయం ఇది. కొందరు పరుగెత్తుతూ బయటికి వస్తే, మరి కొందరు నిదానంగా చేతిలో కాఫీ కప్పుతో బయటకి వచ్చారు. అలా నడుస్తుండగా ఒక అమ్మాయి "ఓ షిట్" అంటూ నేలమీద పడ్డ సెల్‌ఫోన్‌ని చేతిలోకి తీసుకుంది. ఆవిడ తలుపు తెరిచే ప్రయత్నం చెయ్యగా తన చేతిలోని తాళాలు కిందపడ్డాయి. మొదట బాగా జాలేసినా "బాగ్‌ని కింద పెట్టచ్చుగా" అనిపించింది. కొంతమంది స్కూల్ పిల్లలు బయట నిలబడి పేపర్ సిసర్ రాక్ ఆడుతున్నారు. చిన్నప్పుడు

మాక్కూడా స్కూల్ యూనిఫారాలు లేకపోతే ఎంత బావుండేదో అనిపించింది. అపార్ట్‌మెంట్స్ బయటకి రాగానే అన్నయ్య చెప్పిన వాకింగ్ ట్రెయిల్ వెంట నడవసాగాను.

అక్కడ నడుస్తున్న వాళ్ళందరూ పరిచయం ఉన్నట్లుగా నవ్వడం లేదా 'హలో' అనడం చూసి నేనూ 'హాయ్' చెప్పసాగాను. "ఇక్కడ అందరూ ఫ్రెండ్లీగా ఉంటారు" అని అన్నయ్య అనడం గుర్తొచ్చింది. కొందరు మాత్రం 'హౌ ఆర్ యు' అని అడిగి జవాబు కోసం ఆగకుండానే వెళ్ళిపోయారు. బహుశా ఇక్కడ అంతే కాబోలు. చాలావరకు ఈ దారిలో నాకు కనబడింది ముసలివారు. ఎంత దూరం నడిచినా సందులు కనపడక పోవడంతో ఒక నిమిషం ఆగి వెనక్కి తిరిగి చూసాను. ఇదంతా ఒక పొడుగు రొడ్డు. నేననుకున్నంత దగ్గరలో సందులు లేవు.

"ఆర్ యూ ఓకే?" ఇద్దరు ముసలివాళ్ళు నన్ను అడిగారు.

"యెస్" కాస్త భయంగా, కాస్త అయోమయంగా బదులిచ్చాను. వాళ్ళు నా వెనక నడిచారని, నేను సడన్‌గా ఆగడం వల్ల ఏమైనా అయిందేమో అనుకున్నామని చెప్పారు. ఎంతసేపు నడిచినా సందులు లేవేంటని అడిగాను. ఈ ట్రెయిల్ ఆరు మైళ్ళని, మొదటి సందు రెండున్నర మైళ్ళకి కానీ రాదని చెప్పారు. నా ఆశ్చర్యం పసిగట్టి "ఆర్ యు న్యూ హియర్?" అడిగారు.

ఔనని నా కథని చెప్పాను.

"డూ యు నో హూ వెంట్ టు పర్డ్యూ?" ముసలాయన అడిగారు.

"ఐ డోన్ట్ నో" నన్నెందుకు అడుగుతున్నారో అర్థంకాలేదు.

"నీల్ ఆర్మ్ స్ట్రాంగ్" గర్వంగా చెప్పారు.

"ఐ న్యూ దట్"

"డూ యు వాంట్ టు గో టు మూన్?" నవ్వారు.

"ఐ వాంట్ టు గో టు వీనస్"

"వీనస్?" ఇద్దరూ ఆశ్చర్యంగా అడిగారు.

"యెస్. వీనస్ ఈజ్ ది ఓన్లీ హాట్ ప్లానెట్ దట్ రొటేట్స్ ఇన్ ఆపోజిట్ డైరెక్షన్"

"వాట్ డు యు మీన్?"

వాళ్ళకి అర్థం కాలేదని తెలిసి "ఇట్స్ సింపుల్. సన్ రైజెస్ ఇన్ ద వెస్ట్ ఆన్ వీనస్. అండ్ ఇట్ హేజ్ నో ఐస్" అన్నాను.

ఒక్క నిమిషం దాన్ని జీర్ణం చేసుకుని "వాట్ అబౌట్ ఐస్?" అడిగారు.

"యురేనస్ ఈజ్ ఫిల్డ్ విత్ ఐస్ అండ్ హేజ్ లెస్ సన్‌లైట్. బట్ వీనస్ ఈజ్ హాట్"

వాళ్ళకి అర్థం కాలేదని, అర్థం చేసుకోవడానికి కష్టపడుతున్నారని తెలిసి "ఆర్ యు ఫ్రం హియర్?" అడిగాను.

"బార్న్ అండ్ రైజ్డ్" ఆయన బదులు, "ఐం ఫ్రం డకోటా. ఐ మూవ్డ్ ఇన్ స్ప్రింగ్ ఆఫ్టర్ మేరేజ్" ఆవిడ బదులు.

"స్ప్రింగ్ ఏంటి? జనవరిలో పెళ్ళైందా? లేక కొన్నేళ్ళని అలా అంటారా? నాకు అర్థంకాక తలుపాను.

వాళ్ళు కథంతా చెప్పారు. పెళ్ళై ఒక ఏడాది కూడా కాలేదు. కానీ ఇద్దరికీ తెల్ల జుట్టు. అన్నయ్యకన్నా పెద్ద వయసు పిల్లలు, దాదాపు నా వయసు మనవళ్ళు, మనవరాళ్ళు. ఈ వయసులో పెళ్ళేంటో అర్థం కాలేదు. ఇదో కల్చర్ షాక్ నాకు. అలా కబుర్లు సాగుతుండగా ముందుకు ఎంత నడిచానో వెనక్కి అంతే నడవాలని తోచి వారిద్దరికీ బాయ్ చెప్పాను.

ఇంటికి తిరిగి వెళుతుండగా ఎవరో ఒక పెద్ద కుక్కని పట్టుకుని నావైపు వస్తున్నారు. ముందే నాకు కుక్కలంటే భయం. దానిపైన చూడ్డానికి దున్నపోతులా ఉంది. తాడు మరీ  పొడుగ్గా ఉండడం వల్ల కుక్క నన్ను కరిచే ప్రయత్నం చేస్తే విఫలమయ్యే ఆస్కారం లేదు. రోడ్డుమీద నడుద్దామని తలతిప్పితే కార్లు ఎంతో వేగంగా వెళుతున్నాయి. బిక్కుమంటూ నడుస్తుండగా "షీజ్ ఫ్రెండ్లీ" అంటూ ఆ కుక్క యజమాని ముందుకు వస్తాడే కానీ కుక్క నా వైపుకి రాకుండా ఆపడే? కుక్క కరిచిందంటే అందరిలో హేళన అయిపోతాను. నా భయం పసిగట్టినట్లు ఆ కుక్క నా మొహం చూస్తూ రెండడుగులు ముందుకి వేసింది. యజమాని మాత్రం పట్టిచ్చుకోవట్లేదు. తనకన్నా వేగంగా నడుస్తూ కుక్క నన్ను చేరింది. అరుద్దామంటే గొంతు రాలేదు. కళ్ళు మూసుకుపోయాయి. చేతులు నా ప్రమేయం లేకుండా మొహాన్ని మూసాయి. కుక్క ఊపిరి నా కాళ్ళని తాకింది. కదిలితే కరుస్తుందేమో అని భయం ఇంకా పెరిగింది. కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి. ఇందాకటి వాళ్ళతో కలిసి ముందుకి వెళ్ళనందుకు నన్ను నేను తిట్టుకుంటుండగా ఒక నవ్వు వినబడింది. నెమ్మదిగా కళ్ళు తెరిచాను. యజమాని తన కుక్కతో నన్ను దాటి, నవ్వుతూ వెళ్ళిపోయాడు. కుక్కని కంట్రోల్ చెయ్యకుండా నన్ను చూసి నవ్వేంటో ఆ బండబ్బాయికి అనుకుని కోపంగా ఇంటికి నడవసాగాను.

ఇంటి తలుపు తెరిచాక ఒక నిమిషం నా గుండె వేగంగా కొట్టుకుంది. ఇల్లంతా తిరిగి చూసాక నా ప్రాణం తిరిగి వచ్చింది. నేను తలుపుకి తాళం వెయ్యకుండా వాకింగ్‌కి వెళ్ళాను. అదృష్టవసాత్తు దొంగలు పడలేదు. రోజువారి పనులు ముగించి 'ఎ వాక్ టు రిమెంబర్'ని పూర్తి చేద్దామని కూర్చున్నాను. లేన్ డన్ జేమ్‌ని పెళ్ళిచేసుకోవడం చదివి, అంత చిన్న వయసులో పెళ్ళేంటని ఆశ్చర్యపోయాను. పుస్తకం పూర్తయ్యేసరికి నా ఏడుపుకి అవధులు లేవు. అలా ఏడుస్తూనే నిద్రలోకి జారుకున్నాను. అన్నయ్య ఇంటికి వచ్చిన చప్పుడుకి మెలుకువ వచ్చింది.

"ఇవాళ అప్పుడే సాయంత్రం అయిందా అనలేదేంటి?" ఎగతాళి చేసాడు.

నేను బదులివ్వలేదు.

"ఏమైంది? వెళ్ళిపోతున్నావని దిగులా?"

"లేదు. జేమీని తలచుకుంటే ఏడుపొస్తుంది" ఎంత ఆపుకున్నా ఏడుపు ఆగలేదు.

"జేమి ఎవరు?" బిత్తరపోయి అడిగాడు.

"బుక్ లో" ఎవాక్ టు రిమెంబర్ చూపిస్తూ అన్నాను.

"బుక్ లోనే కదా. నిజంగా ఎవరో చచ్చిపోయినట్టు ఏంటి?" చిరాకుపడ్డాడు.

కళ్ళు తుడుచుకుంటూ సోఫాలో కూర్చున్నాను. అన్నయ్య స్నానం పూర్తి చేసాక "బుక్స్ చదివితే అందులో పాత్రలు మనకి తెలిసినట్టుగా అనిపిస్తుంది. కానీ అది ఫిక్షన్. ఎవరో సృష్టించిన కథ. నిజంగా జరిగింది కాదు. ఏడుపు ఆపేయ్" అన్నాడు.

అలా అనగానే ఆగిపోతుందా? కోపం వల్ల నేను బదులివ్వలేదు. "నేను వంట చేస్తున్నా. టీవీ ఆన్ చేస్తావా?" అడిగాడు.

బదులివ్వకుండా ఆన్ చేసాను.

కొన్ని నిమిషాలకి "బుక్స్ చదువుతుంటే నెమ్మదిగా అలవాటౌతుందిలే. ఐదు చదివాక ఆరో దానికి నార్మల్ రియాక్ట్ అవుతావు. మొదట్లో నేను కూడా నీలానే ఉండేవాడిని" కిచెన్‌లోంచి అన్నాడు.

"నువ్వు కూడా ఏడ్చావా?" ఆశ్చర్యపోయాను.

"మరీ నీలాగా ఏడవలేదు కానీ దిగులుపడ్డాను."

"ఇప్పుడు చదివితే దిగులుండదా?"

"ఉంటుంది. కానీ రియాలిటీకి దగ్గరగా ఉంటాను. ఐ కెన్ డీల్ విత్ ఇట్."

నేను ఇప్పుడు రియాలిటీకి నిజంగానే చాలా దూరంగా ఉన్నానని అర్థమై "ఎలా?" అడిగాను.

"నెమ్మదిగా నీకే తెలుస్తుందిలే. ఇంకో నవల మొదలుపెడితే సరి. జేమీని మర్చిపోతావు" నవ్వాడు.

కాసేపు నిశ్శబ్దం తరవాత "ఇంతకీ పొద్దున వాకింగ్‌కి వెళ్ళావా?" అడిగాడు.

"ఆఁ వెళ్ళాను" దారిలో కలిసిన ముసలివాళ్ళు, ఎదురుపడిన కుక్క గురించి విడమరిచి చెప్పాను.

"నయం. ఆ ముసలి వాళ్ళ మొహం మీద అనలేదు ఈ వయసులో పెళ్ళేంటవి" పెద్దగా నవ్వి "ఇక్కడ ఇండియాలోలాగ కాదు. ఏ వయసులో అయినా ప్రేమలో పడతారు. నాకూ అది విచిత్రంగానే అనిపిస్తుంది" అన్నాడు.

"అసలు ఆ కుక్కబ్బాయిని తలచుకుంటేనే ఒళ్ళు మండిపోతుంది"

"చాలామంది అలానే ఉంటారు. నాక్కూడా చిరాకు. వాళ్ళ కుక్క వాళ్ళకి ముద్దుకానీ మనకెందుకు నచ్చుతుంది? కానీ ఇక్కడ రూల్స్ చాలా స్ట్రిక్ట్. ఒక వేళ కుక్క ముడుసార్లు ఎవర్నైనా కరిస్తే చంపేస్తారు"

"అంటే? అర్థంకాక అడిగాను.

"కుక్క కరిచిందని హాస్పటల్‌కి వెళితే ఆ కుక్క మీద కేస్ ఫైల్ చేస్తారు. మూడుసార్లు కుక్క అలా ఎవర్నైనా కరిస్తే దాన్ని యూ తనైజ్ చేస్తారు"

"కుక్క మీద కేస్ ఏంటి? నేను మరీ అంత వెర్రిదాన్ని కాదులే"

"నిజంగా. కుక్కలకి లైసెన్స్ నంబర్ ఇస్తారు. ఆ కుక్క మనుషులకి డేంజర్ అన్న విధంగా ప్రవర్తిస్తే స్ట్రిక్ట్ ఆక్షన్ తీసుకుంటారు అఫ్‌కోర్స్, స్టేట్ టు స్టేట్ లా మారచ్చు."

విడ్డూరంగా అనిపించి నేను నమ్మలేదు. అది నిజమైనా, జోక్ అయినా నాకు పోయేదేం లేదుగా.

భోజనం పూర్తయ్యాక నిన్నటిలా ఇద్దరం కలిసి స్లీపీ టైం టీ తాగుతూ మాట్లాడుకున్నాం.

"రేపు నీదే రాజ్యం. నువ్వు ఏం చేద్దామంటే అది చేద్దాం. షాపుకెళ్ళే పని ఉందా?" అడిగాడు.

"లేదు. హైకింగ్ కి వెళ్దామా?"

"సుబ్బరంగా. పొద్దునే నిన్ను లేపుతా. హైకింగ్‌కి వెళ్ళి బ్రంచ్ చేద్దాం. ఆ తరవాత సంగతి తరవాత చూద్దాం."

"సరైతే నేను పడుకుంటానింక" అన్నయ్య గదిలోకి వెళ్ళాను. పగలు నిద్రపోయినా ఇబ్బంది లేకుండా వెంటనే నిద్రపట్టింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story